

నేడు కాప్సి ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి - విజయనగరం

నగరంలోని ధర్మపురి రోడ్డు ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్‌లో నూతనంగా నిర్మితమైన కాప్సి ఆస్పత్రి బుధవారం ప్రారంభం కానుందని ఆస్పత్రి ఎమ్‌డి డాక్టర్ మోపాడ ప్రవీణ్‌కుమార్, సిఇఒ డాక్టర్ క్రోతు చంద్రశేఖర్ తెలిపారు. ముఖ్యఅతిథుల చేతులమీదుగా బుధవారం మధ్యాహ్నం 12.39 గంటలకు ప్రారంభోత్సవం జరుగుతుందని తెలిపారు. అధునాతనమైన సదుపాయాలతో ఆసుపత్రిని నిర్మించినట్టు తెలిపారు. ఎంఆర్ఐ స్కాన్, సిటీ స్కాన్‌తో పాటు అన్ని రకాల స్కానింగ్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రస్తుతం 100 పడకల ఆస్పత్రిగా ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంత వాసులందరికీ అధునాతనమైన వైద్య సదుపాయం అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో ఈ ఆస్పత్రిని నిర్మించినట్టు తెలిపారు.

సామూహిక గృహ ప్రవేశాలకు సన్నద్ధం

- 36,506 ఇళ్ల నిర్మాణాలు పూర్తి
- పనులు ప్రారంభం కాని 3,994 ఇళ్లు
- 5న బొబ్బిలిలో లాంఛన సభ



గుంకలాంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లనిర్మాణాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో సామూహిక గృహప్రవేశాలకు అధికార యంత్రాంగం సన్నద్ధమౌతోంది. ఈనెల 5న బొబ్బిలి కేంద్రంగా ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి లాంఛనంగా ఇళ్లను ప్రారంభించనున్నారు. అదే రోజు సామర్లకోటలో నిర్మించిన జగనన్న కాలనీని సిఎం జగన్మోహన్‌రెడ్డి కూడా ప్రారంభిస్తారు. అక్కడి నుంచి వర్చువల్ పద్ధతిలో జరిగే సభకు బొబ్బిలిలో ఏర్పాట్లు జరుగుతున్నాయని గృహ నిర్మాణ శాఖ జిల్లా అధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా 649 లేవుట్లలో 34,675 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. సొంత స్థలాల్లో 43,452 ఇళ్లను మంజూరు చేశారు. మొత్తంగా 78,127 ఇళ్లకుగాను 3,994 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభానికి నోచుకోలేదు. 36,506 ఇళ్లు పూర్తయ్యాయినట్టు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. పునాదుల తవ్వకాలు, నిర్మాణ దశలో 18,819 ఇళ్లు ఉన్నాయి. 13,509 ఇళ్ల పునాదులు పూర్తయ్యాయి. ఇంటి పైకప్పువేసే దశలో 3,811 ఇళ్లు, ఇంటిపైకప్పు వేసినవి 1,488 ఉన్నాయి. 71శాతం ఇంటి నిర్మాణాలు పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు. వీటిలో గ్రామీణ ప్రాంతాల్లోనూ, ముఖ్యంగా సొంత స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్లే ఎక్కువ ఉన్నాయి. ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న కాలనీల్లో చాలా వరకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోవడం, నిర్మాణాలు వివిధ దశల్లో నిలిచిపోవడం వంటి పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా రాష్ట్రంలోనే అతిపెద్ద లేఅవుట్‌గా ప్రభుత్వం భావిస్తున్న గుంకలాం లేఅవుట్‌లో నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. ఈ లేఅవుట్‌లో సుమారు 11వేల ఇళ్ల స్థలాలకుగాను 10,154 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో లబ్ధిదారులు సొంతంగా నిర్మించుకోవడం, ప్రభుత్వం తరఫున ఇసుక, సిమెంట్, ఐరన్ వంటి నిర్మాణ సామగ్రిని పంపిణీ చేయడం, పూర్తిగా ప్రభుత్వమే నిర్మించి లబ్ధిదారులకు అప్పగించి ఇవ్వడం వంటి మూడు పద్ధతుల్లో ఇక్కడ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు ఈ లేఅవుట్‌లో కేవలం 352 ఇళ్లు మాత్రమే పూర్తికావడం గమనార్హం. 114 ఇళ్ల నిర్మాణ పనులు నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ఇక్కడ మంజూరైన మొత్తం ఇళ్లలో సుమారు 8వేల వరకు ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాల్సివుంది. కానీ, వీటిలో 3వేల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదు. మిగిలిన ఐదు వేల ఇళ్లు కూడా స్లాబ్ స్థాయిలో పునాదులు మాత్రమే పడ్డాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు పడకపోవడంతో సుమారు ఏడాది క్రితమే సంబంధిత కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. తాజాగా నిధుల సమస్య లేదని అధికారులు చెబుతున్నారు. పనులు కూడా ప్రారంభమైనప్పటికీ అంత చురుకుగా సాగడం లేదు. గతంలో ఇక్కడ ఇళ్ల నిర్మాణ పనులకు కాంట్రాక్టర్ వద్ద రోజు సుమారు 500 నుండి 600మంది పనిచేసేవారు. ప్రస్తుతం 100మందికి మించి కనిపించడం లేదు. దీంతో, పనులు అత్యంత మందకొడిగా సాగుతున్నాయి. ప్రభుత్వం మాత్రం ఈ ఏడాది డిసెంబర్ నాటికి ప్రభుత్వం తరఫున చేపట్టిన ఇళ్ల నిర్మాణాలన్నీ పూర్తిచేయాలని ఆదేశాలు జారీచేసింది. గుంకలాం కాలనీలోని ఇళ్ల నిర్మాణాలకు ఇప్పటి వరకు రూ.44.2కోట్ల మేర గృహ నిర్మాణ బిల్లులు లబ్ధిదారులకు విడుదల చేసినట్టు స్థానిక డిఇ శ్రీనివాసరావు ప్రజాశక్తికి స్పష్టం చేశారు.

మోడీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా

రైతు, కార్మిక సంఘాల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతు, కార్మికసంఘాల నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ నిరంకుశ విధానాలను వ్యతిరేకిస్తూ, వ్యవసాయ నల్లచట్టాలపై ఆందోళన సందర్భంగా మోడీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. అనంతరం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా సమన్వయ కమిటీ నాయకులు బి.రాంబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడారు. రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల వ్యవసాయ చట్టాలు రద్దు చేసి రైతులకు స్వామినాథన్ కమిటీ సిఫార్సులకు అనుగుణంగా మద్దతు ధరకు చట్టం చేయాలని దేశవ్యాప్త రైతు ఉద్యమం జరిగిందన్నారు. ఆ సందర్భంగా మోడీ ఇచ్చిన హామీలను ఏడాదైనా అమలు చేయలేదన్నారు. రైతులు వ్యవసాయ కూలీలు కార్మికులు సామాన్య ప్రజల ప్రయోజనాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెడుతున్నందుకు నిరసిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ సంక్షోభం ఫలితంగా అప్పుల ఊబిలో కూరుకు పోయి ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల రుణాలు మాఫీ చేయడానికి మోడీ ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. కార్పొరేట్ కంపెనీలకు రుణమాఫీచేస్తున్నారని అన్నారు. సామాన్య ప్రజలపైన పన్నుల భారాన్ని పెంచుతూ, కార్పొరేట్లకు ఐటి, ఎక్సైజ్, కస్టమ్స్,కార్పొరేట్ టాక్స్ ల పైన లక్షలాది కోట్ల రూపాయల రాయితీలను ఇస్తున్నారన్నారు. మరోవైపు కార్మికులు బ్రిటిష్ కాలం నుండి పోరాడి 44 కార్మిక చట్టాలను కార్మికులు సాధించుకుంటే కార్మికులను యజమానులకు కట్టు బానిసలుగా మార్చేందుకు వాటిని నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్పుచేస్తున్నారు. ఫలితంగా బలహీన వర్గాల ప్రజల ఉపాధికి నష్టం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాల్, ఉపాధ్యక్షులు ఎల్.అప్పలనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డేగల అప్పలరాజు, కౌలు రైతుసంఘం జిల్లా కన్వీనర్ రాకోటి రాములు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ వి.లక్ష్మి, సిఐటియు నాయకులు ఎ.జగన్మోహన్, బి.రమణ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో మానవహారం

బొబ్బిలి : కేంద్రంలో మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అణిచివేతకు వ్యతిరేకంగా కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు అన్నారు. ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా స్థానిక కోరాడ వీధి కూడలిలో సిఐటియు ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలు రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి కార్మిక వర్గాన్ని బానిసలుగా మారుస్తూ కార్మిక హక్కులు హరిస్తున్నారన్నారు.

ప్రమాదపుటంచున పారాది వంతెన

ద్విచక్ర వాహనాలకు మాత్రమే అనుమతి ●మిగతా వాహనాలు దారి మళ్లింపు



కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న వంతెన

ప్రజాశక్తి-బొబ్బిలి

గత కొంతకాలంగా శిథిలావస్థకు చేరి పారాది వంతెన కుంగిపోతోంది. ప్రమాదపు అంచుకు చేరడంతో ముందు జాగ్రత్తగా అధికారులు ద్విచక్ర వాహనాలకు మాత్రమే వంతెన పైనుంచి రాకపోకలకు అనుమతిస్తున్నారు. ఈ నేపథ్యంలో వంతెనను మంగళవారం సాయంత్రం డిఎస్‌పి పి.శ్రీధర్, పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ వంతెన కుంగిపోవడంతో ప్రమాదాలను నివారించేందుకు వంతెన పైనుంచి ద్విచక్ర వాహనాలకు మాత్రమే రాకపోకలకు అనుమతిస్తున్నట్లు చెప్పారు. విజయనగరం నుంచి బొబ్బిలి వెళ్లే వాహనాలు రామభద్రపురం నుంచి బాడంగి, ముగడ లేదా పినపెంకి మీదుగా, పార్వతీపురం వెళ్లే వాహనాలు రామభద్రపురం నుంచి రాజాం మీదుగా మళ్లిస్తున్నామని చెప్పారు. బొబ్బిలి నుంచి విజయనగరం వెళ్లే వాహనాలను ముగడ లేదా పినపెంకి మీదుగా రామభద్రపురం, పార్వతీపురం నుంచి విజయనగరం వెళ్లే వాహనాలను ఖడ్గవలస మీదుగా దారి మళ్లిస్తున్నామని చెప్పారు. వాహనదారులు గమనించాలని కోరారు.

రైతుల ఆర్థిక ప్రగతికి దోహదం

ప్రజాశక్తి-విజయనగరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నేషనల్ లైవ్ స్టాక్ పథకం రైతుల ఆర్థిక ప్రగతికి దోహదం చేస్తుందని వ్యవసాయ అనుబంధ రంగాల ఉన్నతాధికారులు, సహకార సంఘాల ఛైర్మన్లు, సబ్జెక్టు నిపుణులు పేర్కొన్నారు. నేషనల్ లైవ్ స్టాక్ పథకం అమలు తీరు తెన్నులు, ప్రయోజనాలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, పశు గణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బెల్లాన బంగారు నాయుడు, గొర్రెలు, మేకలు పెంపకందారుల జిల్లా సహకార యూనియన్ ఛైర్మన్ మన్యాల కృష్ణ, ఆయా సంఘాల సభ్యులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎ.విశ్వేశ్వరరావు పథకం తాలూకు ప్రయోజనాలను, విధివిధానాలను, లక్ష్యాలను వివరించారు. వీలైనంత మందికి ఆర్థిక ఫలాలు అందజేయటమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించామని పేర్కొన్నారు. 2026-27 వరకు ఈ పథకం అమల్లో ఉంటుందని రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు యూనిట్ల కొనుగోలుకు, వ్యాపార నిర్వహణకు ప్రభుత్వం 50 శాతం రాయితీతో కూడిన ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, పశుగణాభివద్ధి సంస్థ ఛైర్మన్ బెల్లాన బంగారు నాయుడు మాట్లాడుతూ రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా మరింత ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పశు సంవర్ధక శాఖ డిడి వై.వి. రమణ, ఇతర వైద్యులు, సబ్జెక్టు నిపుణులు పలు అంశాలపై రైతులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్‌డిఎం శ్రీనివాసరావు, పశు వైద్యులు డాక్టర్ లీలయ్య, డాక్టర్ దామోదర్, డాక్టర్ మహాలక్ష్మి, యువ శాస్త్రవేత్త సతీష్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, వివిధ సంఘాల సభ్యులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ వెంకటేశ్వరరావు

సిరిమాను సంబరాలకు నేడు పందిరిరాట

విజయనగరం టౌన్ : అక్టోబరు 29 నుంచి 31 వరకు నిర్వహించనున్న శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను ఉత్సవాలకు బుధవారం ఉదయం పందిరిరాట కార్యక్రమంతో అంకురార్పణ చేయనున్నట్టు ఆలయ ఇఒ కెఎల్ సుధారాణి తెలిపారు. ఉదయం 8.30 గంటలకు దీక్షధారణ కార్యక్రమం చదురుగుడి ఆలయం వద్ద జరుగుతుందని, అనంతరం 9.30 గంటలకు చదురుగుడి వద్ద, 11గంటలకు వనంగుడి వద్ద పందిరిరాట కార్యక్రమం ఆలయ సంప్రదాయాల మేరకు నిర్వహించనున్నట్టు తెలిపారు.

నేడు రాజాంలో జగనన్నకు చెబుదాం

విజయనగరం : జిల్లాలో అక్టోబరు నెలకు సంబంధించి జగనన్నకు చెబుదాం ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమం షెడ్యూల్ ఖరారైనట్టు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి వెల్లడించారు. ఈనెల 4న రాజాంలో వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. 11వ తేదీన ఎల్.కోట, 15న దత్తిరాజేరు, 25న రేగిడి ఆమదాల వలసలో కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఆయా మండలాల ప్రజలు తమ సమస్యలను నివేదించవచ్చని తెలిపారు.

టెట్‌లో సాయి గాయిత్రి విద్యార్థి ప్రతిభ

విజయనగరం టౌన్ : తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన టెట్ - 2023లో తోటపాలెం సాయి గాయత్రి డైట్ కళాశాలకు చెందిన విద్యార్థి కొలుసు అప్పలరాజుకు రాష్ట్రస్థాయి 2వ ర్యాంకు సాధించాడు. 150 మార్కులకుగాను 126 మార్కులు సాధించాడు. అలాగే 2018లో ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన టెట్‌లో 146 మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ అల్లు ఆది నారాయణ, ఎన్. శ్రీనివాస మోహన్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

సోషల్ మీడియాకు అలవాటు పడొద్దు

ప్రజాశక్తి-విజయనగరం

విద్యార్థులు సోషల్‌మీడియాకు అలవాటు పడొద్దని వన్‌టౌన్ సిఐ బి.వెంకటరావు అన్నారు. నగరంలోని అపెక్స్ జూనియర్ కళాశాల విద్యార్థులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సైబరు మోసాలు, సోషల్ మీడియా వలన కలిగే అనర్థాల పట్ల అవగాహన కల్పించారు. విద్యార్థులు అపరిచిత వ్యక్తులు, సైబరు మోసగాళ్ళ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు తమ చదువుల పట్ల శ్రద్ధ పెట్టాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటి సాధనకు కృషి చేయాలని అన్నారు. ఇంటర్నెట్‌ను విజ్ఞానం పెంచుకొనేందుకు ఉపయోగించు కోవాలన్నారు. అలా కాకుండా కాలక్షేపం, బెట్టింగులు, గేమ్స్ కు వాడడం వలన చదువు పట్ల ఆసక్తి తగ్గుతుందన్నారు. సైబరు మోసాలకు, వేధింపులకు గురైతే 1930కు ఫిర్యాదు చెయ్యాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రామ గణేష్, అపెక్స్ కళాశాల ప్రిన్సిపాల్ నిజాముద్దీన్, వన్ టౌన్ పోలీసులు, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జానపద కథలు పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఉపాధ్యాయుడు బద్రి కూర్మారావు సేకరించిన కళింగసీమ జానపద కథలు పుస్తకాన్ని మంగళవారం గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గిరిజన విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టివి కట్టమణి ఆవిష్కరించారు. జానపద కళలు, జానపద కథలు సేకరించి దాచుకోవలసిన అవసరం సమాజానికి ఎంతైనా ఉందని, దానికి విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు ఎంతో పాటుపడాలని పేర్కొన్నారు. బద్రి కూర్మారావు వంటి ఉపాధ్యాయులు జానపద సాహిత్యాన్ని రక్షించడానికి తన వంతు కృషి చేయడం ఎంతో ముదావహమని ప్రశంసించారు. ఉత్తరాంధ్రలో వివిధ ప్రాంతాలలో తను పనిచేసిన పాఠశాలలో విద్యార్థులతో జానపద కథలను సేకరించి వాటిని క్రోడీకరించి ఒక పుస్తక రూపంలో తేవడం జానపద సాహిత్యానికి ఎంతో తోడ్పాటునందించినట్టు కవి రచయిత కిలపర్తి దాలి నాయుడు అన్నారు. అనేక రకాలైన మన తరతరాల సంపద అయిన జానపద కథలను సేకరించి ఈ పుస్తకంలో క్రోడీకరించబడ్డాయని పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక నాయకులు ఎంవిఆర్ కృష్ణాజి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర యాస, భాష పిల్లలు చదివి అర్థం చేసుకుంటే తెలుగుపై మంచి పట్టు సాధించగలరని పేర్కొన్నారు. కార్యక్రమంలో అరసం ప్రధాన కార్యదర్శి రత్నాల బాలకృష్ణ, జక్కు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విసి కట్టమణి తదితరులు



డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని సత్కరిస్తున్న కాంట్రాక్టర్లు

'నూతన ఆవిష్కరణలకు స్ఫూర్తి' పై సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా 'నూతన ఆవిష్కరణలకు స్ఫూర్తి' అనే అంశం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్, విశాఖ గాయత్రి విద్యా పరిషత్ కు చెందినడాక్టర్ రవిశంకర్ సరిపల్లె విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'విద్యార్థులు మొదటి సంవత్సరం నుంచే 'స్టార్టప్' కంపెనీలను ప్రారంభించాలని ఆలోచించడం ద్వారా వారి ఇంజనీరింగ్ విద్యను ప్రారంభించాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డివిరామమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమన్వయంతో ప్రమాదాల నివారణ : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రమాదాల నివారణకు అన్ని శాఖలూ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐ-రాడ్ లో పెండింగ్ ఉన్న కేసు లన్నిటినీ శనివారంలోగా డిస్పోజ్ చేయాలని తెలిపారు. పోలీస్, మెడికల్, హైవే , ట్రాన్స్‌పోర్టు శాఖలు వారి లాగిన్ లో ఉన్న కేసులను సమన్వయంతో పరిష్కరించాలని అన్నారు. ప్రమాదాల నివారణకు ఓవర్ లోడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ వాడకం, సెల్ ఫోన్ డ్రైవింగ్ పై డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. కళాశాలల్లో, విద్య సంస్థల్లో యువతకు అవగాహన కల్పించాలని అన్నారు. ఇకపై ప్రతి మొదటి శుక్రవారం రోడ్ సేఫ్టీ సమావేశం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో రవాణా శాఖ ఉప కమిషనర్ రవీంద్ర నాథ్, మున్సిపల్ కమిషనర్ శ్రీ రాములు నాయుడు, ట్రాఫిక్ పోలీస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లెయిమ్‌లు తక్షణమే పరిష్కరించాలి

విజయనగరం : ఓటర్ల సవరణలో భాగంగా ఫారం 6,7,8 కింద వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. నోటీసులు జారీ చేసే ప్రక్రియ ఈ శుక్రవారం లోగా పూర్తి కావాలని సూచించారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కలెక్టర్లు కు పలు సూచనలు జారీ చేశారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టరు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒ అనిత తదితరులు హాజరయ్యారు. బుధవారం నుంచి ఇవిఎంల వెరిఫికేషన్ చేపట్టి 14 లోగా పూర్తి చేస్తామని కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులతో మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితా కార్యక్రమంలో రాజకీయ పార్టీలు సమర్పించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, చనిపోయిన, డూప్లికేట్, బదిలీ చేయబడిన, నకిలీ ఓటర్ల జాబితాల వెరిఫికేషన్, ఎపిక్ కార్డ్ జనరేషన్, తదితర ఆన్‌లైన్‌లో పెండింగ్ ఉన్న అంశాలను వెంటనే డిస్పోజ్ చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో రిటర్నింగ్ అధికారులు పద్మలత, సుదర్శన దొర, వెంకటేశ్వర రావు, నూక రాజు, అప్పారావు, శేష శైలజ , డిటిలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

నగరాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరాభివద్ధిలో భాగస్వామ్యం కావాలని కార్పొరేషన్ కాంట్రాక్టర్లకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం కార్పొరేషన్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నేతృత్వంలో నూతనంగా ఏర్పాటు అయిన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. నగరపాలక సంస్థ కార్యాలయానికి ఆనుకొని ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌పై అంతస్తులో కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఈ నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా కోలగట్లను కార్పొరేషన్ కాంట్రాక్టర్ల సంఘం ఘనంగా సత్కరించింది. కార్యాలయ ప్రారంభోత్సవం అనంతరం స్వామి మాట్లాడుతూ అందరిసమన్వయంతోనే సాధ్యమవుతుందని అన్నారు. ఇదే ఒరవడితో మరింత ఉత్సాహంగా అభివద్ధి పనులు పూర్తిచేసి నగరాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దే క్రమంలో కాంట్రాక్టర్ల పాత్ర కీలకమని అన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాంట్రాక్టర్లను ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ పొరుగునున్న విశాఖపట్నంకు ధీటుగా మన నగరం కూడా అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కమిషనర్ రాములునాయుడు మాట్లాడుతూ ఇంజినీరింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేసి నగరాన్ని అభివృద్ధి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, ఇఇ కె.శ్రీనివాసరావు, కార్పొరేషన్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బండారు బంగారాజు, విశాఖపట్నం అసోసియేషన్అధ్యక్షుడు చంద్రమౌళి, కార్పొరేటర్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.


బిటి రోడ్డు ప్రారంభం

నగరంలోని దాసన్నపేట కాళీమాత ఆలయం జంక్షన్ వద్ద రూ.30లక్షలతో ఏర్పాటు చేసిన బిటి రోడ్డును డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజావసరాలకు అనుగుణంగా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సమకూర్చుతున్నారన్నారు. కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జి కోలగట్ల కృష్ణారావు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ సంఘం రెడ్డి బంగారు నాయుడు, బొద్దాన అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గజపతినగరం

ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ తమ ప్రభుత్వం నెరవేర్చిందని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. మండలంలోని కెంగువ గ్రామంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం గత నాలుగున్నరేళ్ల నుంచి అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రజల ఖాతాలకు రూ.2.35లక్షల కోట్లు జమ చేసిందని తెలిపారు. గ్రామంలో ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గార తౌడు, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, మండల నాయకులు మండల సురేష్, బెల్లాన త్రినాధరావు, లెంక శ్రీనివాసరావు, కెంగువ యువ నాయకులు గణేష్, సామంతుల పైడిరాజు, జెసిఎస్ కన్వీనర్ కనకల సుబ్రహ్మణ్యం, గ్రామ సర్పంచ్ కొండల సూరప్పడు, ఎంపిటిసి కొండల సునీత తదితరులు పాల్గొన్నారు.



కెంగువలో గడపగడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేఅప్పలనర్సయ్య

విద్యార్థినికి కోలగట్ల అభినందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల ఐక్యరాజ్య సమితిలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డిజి) సదస్సుకు అమెరికా వెళ్లి వచ్చిన నగరంలోని కస్పా హైస్కూలు విద్యార్థిని అల్లం రిషితా రెడ్డిని డిప్యూటీస్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అభినందించారు. ఎపిలో అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను అంతర్జాతీయ వేదికపై వివరించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10మంది విద్యార్థులను బ్రాండ్ అంబాసిడర్లగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన విషయం విదితమే. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని లబ్ధిపొందిన వారే చెప్పడం సమంజసమని భావించిన ప్రభుత్వం.. పేద కుటుంబాలకు చెందిన 10 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను గత నెల 15 నుంచి 27వ తేదీ వరకూ అమెరికా పంపింది. విద్యార్థుల బృందంలో స్థానిక కస్పా పాఠశాలలో పదో తరగతి చదివి, 587 మార్కులు సాధించిన అల్లం రిషితారెడ్డి ఒకరు. ఆమె ప్రస్తుతం నూజివీడు ఐఐఐటిలో చదువుతోంది. అమెరికా నుంచి వచ్చిన అనంతరం ఆమె కోలగట్లను తన నివాసం వద్ద మర్యాద పూర్వకంగా కలిసింది. అంతర్జాతీయ వేదికపై ప్రసంగించే అవకాశం రావడం ఆనందంగా ఉందని వివరిస్తూ.. తాను వెళ్లే ముందు 150 డాలర్లు ఇచ్చి ఆర్థిక సహాయం చేసిన కోలగట్లకు ధన్యవాదాలు తెలిపింది. ఈ సందర్భంగా విద్యార్థినికి పుష్పగుచ్ఛంతో ఉప సభాపతి ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు రామకృష్ణారెడ్డి, ఉదయ లక్ష్మి, కస్పా పాఠశాల హెచ్ఎం శంకరరావు పాల్గొన్నారు.

జయకృష్ణ మాస్టారికి పురస్కారం

వంగర: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఆంగ్ల పుస్తక రచయిత సూర జయకృష్ణ మాస్టర్‌కు గురుస్పందన పురస్కారం లభించింది. స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో గల ఆంధ్ర యూనివర్సిటీలో ఈనెల 2న గురు స్పందన అవార్డుల కార్యక్రమంలో ఆ సంస్థ చైర్మన్ శామ్యూల్ రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్లు జయకృష్ణ మంగళవారం తెలిపారు. ఆంగ్ల విద్య, సేవా కార్యక్రమాలలో జయకృష్ణ విశేష సేవలు అందించినందుకు ఈ పురస్కారం లభించిందని ఆయన వెల్లడించారు. పురస్కారం లభించడం పట్ల వంగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎమ్ ముద్దాడ రమణమ్మ, తదితరులు ఆయన్ను అభినందించారు.

నేషన్ బిల్డర్స్ పురస్కారాల ప్రదానోత్సవం


బొబ్బిలి: విద్యా బోధనలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నేషన్ బిల్డర్ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు జేసీ రాజు, ట్రెజరర్ ఎస్.శ్రీనివాస్ చెప్పారు. పట్టణంలోని మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ అంతర్జాతీయ రోటరీ సంస్థ ఆదేశాలు మేరకు ఎంఇఒలు ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. తెర్లాం మండలంలోని జెబి ధనంజయరాజు, వై.రాము, బొబ్బిలి మండలం నుంచి ఎం.శ్రీనివాసరావు, పి.కస్తూరి, రామభద్రపురం మండలం నుంచి వి.వేణుగోపాలరావు, ఉత్తమ ఎంఇఒ అవార్డును బొబ్బిలి ఎంఇఒ చల్ల లక్ష్మణరావును ఎంపిక చేసినట్లు వెల్లడించారు. వీరికి ఈనెల 5న సాయంత్రం శ్రీసూర్య రెసిడెన్సీలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు మురళి, ఆర్‌డిఒ పి.శేషశైలజ, డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీ చేతులు మీదుగా అవార్డులు అందజేస్తామని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఎన్నికల హామీల అమలుకు ప్రాధాన్యత

బొబ్బిలి: మున్సిపాలిటీలో ఎన్నికల హామీలను అమలు చేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అన్నారు. స్థానిక 20వ వార్డులో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేసేందుకు ఇప్పటి వరకు మున్సిపాలిటీలో రూ.5కోట్లు వరకు ఖర్చు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ, వైసిపి నాయకులు ఎస్.వెంగళరావు, ఎస్.వాసంతి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పత్ర ద్రావణంతో చీడపీడల నివారణ

పూసపాటిరేగ: పలు పత్ర ద్రావణంతో చీడపీడలు, తెగుళ్ల నివారించవచ్చునని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇంఛార్జి కొప్పాక లక్ష్మి తెలిపారు. మండలంలోని కందివలస యూనిట్ గుణపరెడ్డి పేట గ్రామంలో గ్రామ రైతులు, మహిళా సంఘ సభ్యులతో సామూహికంగా ఈ కషాయాన్ని మంగళవారం తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కషాయం 25 రకాల ఆకులు, పువ్వులతో తయారు చేయవచ్చునని వీటిలో ఒక్కొక్క రకం ఆకు రెండు కేజీలు, ఒక్కొక్క కేజీ చొప్పున తీసుకుని నీటిలో ఐదు నుండి ఏడు రోజులు మురగపెట్టి ద్రావణం తయారు చేయవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిఆర్‌పి దీప్తి, ఫార్మర్ సైన్టిస్ట్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



ఉదయపావనిని సత్కరిస్తున్న జనసేన నాయకులు మాధవి, తదితరులు

డిఎస్‌పి ఉదయ పావనికి సత్కారం

నెల్లిమర్ల: నూతన డిఎస్‌పి ఉదయ పావనిని జనసేన నియోజకవర్గ నాయకులు లోకం మాధవి మంగళవారం అలుగోలు గ్రామంలో సత్కరించారు. ఇటీవల గ్రూప్ 1 ఫలితాల్లో కెల్ల ఉదయ పావని డిఎస్‌పిగా ఎంపికైన సందర్భంగా నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు లోకం మాధవి, వీర మహిళలు శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం లోకం మాధవి మాట్లాడుతూ మన ప్రాంతం యువత ఉదయ పావనిని స్ఫూర్తిగా తీసుకుని మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వారి శిక్షణ కోసం అవసరమైతే తానే ఒక కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తానని యువతకు హామీ ఇచ్చారు.

జగనన్న కాలనీలో జోరుగా అభివృద్ధి పనులు

బొబ్బిలి: పట్టణంలోని ఐటిఐ కాలనీ సమీపంలో వేసిన జగనన్న కాలనీలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఈనెల 5న జగనన్న కాలనీలో సామూహిక గృహ ప్రవేశాలను సిఎం జగన్మోహన్ రెడ్డి వర్చువల్ పద్ధతిలో ప్రారంభించనున్నారు. దీంతో రోడ్ల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. అమృత్ పథకం కింద తాగునీటి సౌకర్యం కల్పించనున్నారు. అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, పబ్లిక్ హెల్త్ ఇఇ దక్షిణామూర్తి పరిశీలించారు. రోడ్ల నిర్మాణానికి రూ.27లక్షలు కేటాయించినట్లు చెప్పారు.

కవితా సంకలనంలో ఉపాధ్యాయులకు చోటు

బాడంగి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు ఉపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావు, తెలుగు ఉపాధ్యాయుడు ఉత్తరావల్లి రామారావులు రచించిన కవితలు గురు బ్రహ్మ కవితా సంకలనంలో స్థానం పొందాయి. రచనా సమాఖ్య అధ్యక్షులు మిండి విజయమోహనరావు ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ ఆదివారం బొబ్బిలి కళాభారతిలో జరుగు ఆవిష్కరణ సభకు తమను ఆహ్వానిస్తూ సమాచారం పంపారని ఉపాధ్యాయులు తెలిపారు. జాతీయ స్థాయిలో వచ్చిన 108 కవితలలో వీరి కవితలకు స్థానం దక్కడం ఎంతో గర్వించదగ్గ విషయమని ప్రధానోపాధ్యాయులు దత్తి సత్యన్నారాయణ ఇతర ఉపాధ్యాయులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఎపి రెవెన్యూ అసోసియేషన్ సెక్రటరీగా బంగార్రాజు

భోగాపురం: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ సెక్రటరీ-1గా భోగాపురం తహశీల్దార్ చింతాడ బంగార్రాజును ఎన్నుకున్నారు. ఇటీవల విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా బంగార్రాజును సెక్రటరీ-1గా ఎన్నుకున్నారు. దీంతో ఆయనను డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు, సర్వేయరు ముదికేశ్వరరావు, ఆర్‌ఐ కిషోర్, సిఎస్‌డిటి మురళి, విఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నూతన పింఛన్లు పంపిణీ

శృంగవరపుకోట: పట్టణంలోని సచివాలయం-3 పరిధిలో నూతనంగా మంజూరైన 30 పింఛన్లను ఎంపిపి సండి సోమేశ్వరరావు వాలంటీర్లు ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఒక్క అర్హునికి పింఛన్ అందిస్తున్నామని ఇంకా అర్హులు ఎవరైనా ఉంటే నూతన పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, మేజర్ పంచాయతీ సర్పంచ్ గనివాడ సంతోష్ కుమార్, ఎంపిటిసి గంగరాజు, ఇంచార్జ్ ఇఒ కన్నబాబు, వార్డు సభ్యులు శేఖరు, భారతి, గణేష్, సూరిబాబు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వైసిపి ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులుగా సముద్రపు రామారావు

ప్రజాశక్తి - నెల్లిమర్ల



వైసిపి సీనియర్ నాయకులు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు వైసిపి ట్రేడ్ యూనియన్ విభాగం జిల్లా అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆయనకు లిఖిత పూర్వకంగా నియామక ఉత్తర్వులు అందాయి. పార్టీలో తొలి నుంచి సేవలందిస్తున్న రామారావుకు జిల్లా స్థాయి అధ్యక్ష పదవి రావడం ఆయనకు పార్టీ పరంగా తగిన గుర్తింపు లభించినట్లయింది. సుమారు 30 సంవత్సరాల నుంచి రాజకీయ రంగంలో ఉన్న రామారావు ఇప్పటికే ఎన్నో పదవులను నిర్వర్తించారు. ప్రధానంగా గ్రామంలో 1988లో స్థాపించిన ఉషోదయ యూత్ అసోసియేషన్ ద్వారా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించి, గ్రామస్తులకు, చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలకు చైతన్య పరిచారు. జిల్లా రేషన్ డీలర్ల సంఘం ఉపాధ్యక్షులుగా, కార్యనిర్వాహక అధ్యక్షులుగా, రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షులుగా వ్యవహరించారు. అలాగే ప్రస్తుతం ఆదే సంఘానికి జిల్లా గౌరవ అధ్యక్షులుగా కూడా వ్యవహరిస్తున్నారు. నగర పంచాయతీ 20వ వార్డు కౌన్సిలర్ గా ఘన విజయం సాధించి ప్రస్తుతం నగర పంచాయతీ వైస్ చైర్మన్‌గా సేవలందిస్తున్నారు.

మెరుగైన వైద్యమే ప్రభుత్వ ధ్యేయం : జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి - మెరకముడిదాం


పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించటమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని గర్భాం-2 సచివాలయం పరిధిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గర్భాం మేజర్ పంచాయతీకి సంబంధించి ఏడు గ్రామాల నుండి వచ్చిన రోగులకు ఏవిధమైన వైద్య సేవలు అందుతున్నాయి, ఏఏ రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు, ఎంత మందికి ఇంకా మంచి వైద్యం కోసం రిఫర్ చేశారు, ఎంతమంది రోగులు హాజరయ్యారు అనే విషయాలను వైద్యాధికారులు అనిల్ రామ్ కుమార్ రెడ్డి, ఆజయిన్‌ను అడిగి తెలుసుకున్నారు. కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న కౌంటర్ దగ్గరికి వెళ్లి తాను కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి కృష్ణవేణి, సర్పంచ్ గాబ్రియేల్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాడ్డి వేణుగోపాలరావు, జిల్లా కోఆప్షన్ సభ్యులు ఎస్‌వి రమణరావు, వైసిపి మండల అధ్యక్షులు కోట్ల విశ్వేశ్వరరావు, కెవిఎస్‌ఆర్ ప్రసాద్, వప్పల క్రిష్ణ మూర్తి, బూర్లె నరేష్ కుమార్, సత్తారు జగన్ మోహనరావు, సత్తారు శ్రీను, తాడ్డి చంద్రశేఖర్, ఎంపిడిఒ ఎం. రత్నం, డిటి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేషమైన స్పందన కరువైంది. ఆ గ్రామ సచివాలయంలో కాగాం, వీరాది పేట, అరసి బలగ, మెరుగువలస గ్రామాలున్నాయి. ఈ గ్రామాలలో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి 2529 మందికి సర్వే చేశారు. అందులో బిపి 1834, షుగర్ 1373, బిబిపి 892, ఉన్నట్లు వైద్య సిబ్బంది లెక్కలు చూపించారు. వీరంతా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉండగా ఆయా గ్రామాలలో ప్రజలకు స్లిప్పులు ఇచ్చారు. కానీ కార్యక్రమానికి మాత్రం కేవలం 250 మంది హాజరయ్యారు. దీంతో గ్రామాల్లో సర్వే చేసిందంతా ఉట్టి కాగితపు లెక్కలే తప్ప ప్రజల్లోకి కార్యక్రమం వెళ్లలేదని విమర్శలు ఎదురయ్యాయి. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.రమణ్ కుమార్, ఇఒపిఆర్‌డి నీలిమ, సర్పంచ్ పార్వతి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారని ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు అన్నారు. మండలంలోని మోదవలస సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్ము నాయుడు, ఎంపిడిఒ డిడి స్వరూపరాణి, తహశీల్దార్ పి.ఆదిలక్ష్మి, సర్పంచ్ కనకల పోలమాంబ, నాయకులు కనకల రామారావు, రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ బోని అప్పలనాయుడు, ఎర్రినిండి కృష్ణ, మోపాడ, డెంకాడ వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మంగళవారం రామతీర్థం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ల సుధారాణి, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, సర్పంచ్ కంచరాపు కళావతి, ఎంపిడిఒ జి.రామారావు, నాయకులు కంచరాపు రాము, తర్లాడ దుర్గారావు, డాక్టర్ల బృందం, మెడికల్ స్టాఫ్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. **కొత్తవలస:** మండలంలోని వీరభద్రపురం సచివాలయంలో జగనన్న సురక్ష ఉచిత మెగా వైద్యశిబిరంలో 340 మందికి తనిఖీలు చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ ఇ. గోపాలకృష్ణ తెలిపారు. డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు కళ్లద్దాలు 5 మందికి నెక్కల నాయుడుబాబు అందించారు. మెగా వైద్య శిభిరానికి వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, తహశీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపిడిఒ వై. పద్మజ, మాజీ ఎంపిపి గొరపల్లి శివ, వైసిపి మండల నాయకులు ఒబ్బిన నాయుడు, మేలాస్త్రి అప్పారావు, బొంతల వెంకటరావు, సర్పంచ్ గేదెల రాములమ్మ, గేదెల త్రినాథమూర్తి, వైస్ సర్పంచ్ కె. నరసింగరావు, పంచాయతీ సెక్రటరీ బి. శైలజ, పిహెచ్‌సి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **శృంగవరపుకోట:** ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ను తయారు చేయటమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని చింతలబడి గ్రామ సచివాలయం-1 పరిధిలో గల ప్రజలకు నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో, ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, ఎస్.కోట మేజర్ పంచాయితీ సర్పంచ్ జి.సంతోషికుమారి, తహశీల్దార్ శ్రీనివాసరావు, పంచాయితీ విస్తరణాధికారి లక్ష్మి, వైద్యాధికారులు, పంచాయితీ కార్యనిర్వహణాధికారి, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : పేద ప్రజల సంక్షేమం ఆరోగ్యం కోసం ఇంటింటికి వైద్యం పేరిట ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష పథకం పేదల ఆరోగ్యానికి రక్ష అని ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని భూశాయవలస సచివాలయం వద్ద జగనన్న సురక్ష ఉచిత వైద్య శిబిరాన్ని తహశీల్దార్ రాజారావు, ఎంపిడిఒ రమామణి ఆధ్వర్యంలో సందర్శించారు. వైద్యాధి కారులు రత్న దీపక్, ఏయల్జీ శిరీష, అపర్ణ, సౌజన్యలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.పార్థసారధి, విఆర్‌ఒ ఆనందరావు, ఆరోగ్య సహాయకురాలు యన్ హైమావతి, ఎఒ అక్కారావు, ఇఒపిఆర్‌డి రాజు, సీనియర్ సహాయకులు చొక్కాపు శ్రీరాములు నాయుడు, పూడి కిరణ్, సచివాలయం కన్వీనర్లు, అంగన్వాడీ సిబ్బంది, ఆశావర్కర్లు, వివిధ సచివాలయాల డిజిటల్ సహాయకులు, మహిళా పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.



మెరకముడిదాం: కంటి పరీక్షలు చేయించుకుంటున్న జిల్లా పరిషత్ చైర్మన్

క్రీడల్లో విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - శృంగవరపుకోట

కొత్తవలస ప్రగతి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల మైదానంలో నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, టెన్నీ కొయిట్, కోకో, అథ్లెటిక్స్, యోగ, షటిల్ బ్యాడ్మింటన్, త్రో బాల్ స్కూల్ గేమ్స్ అండర్ 14,17 బాలబాలికల పోటీలలో అన్ని విభాగాలలోను ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు సత్తాచాటారు. ఇందులో భాగంగానే జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలియజేశారు. ఈ ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బంగారు ఉమామేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేస్తూ త్వరలో జరగబోవు జిల్లాస్థాయి పోటీల్లో కూడా పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. క్రీడాకారుల ఎంపికకు తర్ఫీదు నిచ్చి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు పొట్నూరు శ్రీరాములు, లోకిరెడ్డి కృష్ణ, యోగ ఉపాధ్యాయిని పొట్ట కళ్యాణిలను అభినందించారు. **గంట్యాడ:** మండలంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు విజయనగరం రోటరీ క్లబ్ నిర్వహించిన నవోత్సవాలలో పాల్గొని జిల్లా స్థాయిలో విజయం సాధించారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన నవోత్సవాలలో ముగ్గురు విద్యార్థులు ప్రథమ బహుమతులను పొందారు. ఇందులో తెలుగు వైద్య పఠనాన్ని భాగవతంలోని గజేంద్ర మోక్ష పద్యాలు పై పోటీలు నిర్వహించారు. ఉన్నత పాఠశాల స్థాయిలో 10వ తరగతి చదివిన విద్యార్థి పిఎస్‌వి శేషాచార్యులు ప్రథమ స్థానం సంపాదించాడు, కళాశాల స్థాయిలో ఎంపిసి ద్వితీయ సంవత్సరం చదువుతున్న డి సందీప్ ప్రథమ స్థానం సాధించాడు. శాస్త్ర సాంకేతిక అంశాలు అనే విషయంపై చిత్ర లేఖనంలో సిఇసి ప్రథమ సంవత్సరం చదువుతున్న డి తేజ ప్రథమ స్థానం సాధించాడు, వీరు ముగ్గురికి ఎస్వీఎన్ లేక్ ప్యాలెస్‌లో రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ ఆర్ సుబ్బారావు చేతుల మీదుగా ఇటీవల బహుమతులను అందించారు వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్ఆర్ కృష్ణారావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



కొత్తవలస: నిఖిల్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సోంపురం విద్యార్థుల ప్రతిభ

వేపాడ: మండలంలోని సోంపురం ఉన్నత పాఠశాలకు చెందిన స్కౌట్ విద్యార్థులు వి రాకేష్, ఎన్ అజయ్, బి. చైతన్య గత నెల 28 నుండి ఈ నెల 2 వరకు గుంటూరు గొల్లమూడుపాడులో జరిగిన సౌతర్న్ రీజియన్ పెట్రోల్ లీడర్ జాంబోరిట్‌లో పాల్గొని ప్రతిభను కనబరిచినట్లు పాఠశాల అడ్వాన్స్ స్కౌట్ మాస్టర్ బిపిఎ రాజు మంగళవారం తెలిపారు. వివిధ రాష్ట్రాల నుండి స్కౌట్స్, గైడ్స్ పాల్గొనే కార్యక్రమంలో జిల్లా నుండి ప్రాతినిధ్యం వహించిన 22 మంది విద్యార్థులలో సోంపురం పాఠశాల నుండి ముగ్గురు స్కౌట్స్ పాల్గొన్నారని చెప్పారు. వీరు ఫస్ట్ ఎయిడ్, గాడ్జెట్స్, గ్లోబల్ వార్మింగ్ తదితర అంశాల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లాకు 11 పథకాలు సాధించారని తెలిపారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపినట్లు ఆయన చెప్పారు.

వాలీబాల్ టోర్నమెంట్‌లో రెండో స్థానం

కొత్తవలస: ఉమ్మడి జిల్లా స్థాయిలో జరిగిన అండర్ 17 స్కూల్ గేమ్స్ వాలీబాల్ విభాగంలో 9 నియోజకవర్గాల మధ్య టోర్నమెంట్ గత నెల 29న సీతానగరం మండలంలో నిర్వహించారు. దీనిలో నియోజకవర్గం వాలీబాల్ అండర్ 17 బాలురు, బాలికలు జట్లు రెండో స్థానం సాధించారని నియోజకవర్గ ఇంఛార్జి పీడీ కె. కృష్ణంరాజు మంగళవారం తెలిపారు. వీరిని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, నియోజకవర్గ పిఇటిలు అభినందించినట్లు ఆయన తెలిపారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్‌కు నిఖిల్

కంటకాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కె. నిఖిల్ అండర్ -17 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఇమంది సత్యనారాయణ, పీడీ సిహెచ్ అమరావతి తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 6వ తేదీన పల్నాడులో జరగనున్నాయన్నారు. ఈ విద్యార్థికి పీడీ అమరావతి స్పోర్ట్ డ్రస్సు, వెయ్యి రూపాయలు బహుకరించారు. విద్యార్థి ఎంపిక పట్ల ఎంఇఒ- 2 బండారు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

తక్కువ వడ్డీతో రుణాలు

ప్రజాశక్తి - మెంటాడ

కమర్షియల్ బ్యాంక్‌లకు ధీటుగా కోపరేటీవ్ బ్యాంకులలో తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నామని కోపరేటివ్ బ్యాంక్ జనరల్ మేనేజర్, ఒఎస్‌డి జి.సత్యనారాయణ రాజు అన్నారు. మంగళవారం చల్ల పేటలో 21వ నూతన కోపరేటివ్ బ్యాంక్‌ను ప్రారంభించారు. జిల్లాలో సేవలను విస్తరిస్తున్నట్లు చెప్పారు. విద్య, వ్యవసాయం, తనఖా రుణాలు తక్కువ వడ్డీతో అందిస్తున్నామన్నారు. రుణాలకు తక్కువ వడ్డీ, డిపాజిట్‌లకు ఎక్కువ వడ్డీ అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఇఒ కె.జనార్ధన, చైర్మన్ వెంకట చినరామునాయుడు, మెంటాడ పిఎసిఎస్ అధ్యక్షులు తాడ్డి రామచంద్రరావు, డైరెక్టర్స్ నారాయణ రావు, కాంతారావు, డిజిఎంలు ఉమామహేశ్వరరావు, కెవివిఆర్‌ఎస్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

బదలాయింపుపై హర్షం

ప్రజాశక్తి - బొబ్బిలి

ప్రభుత్వం గ్రేడ్ 5 కార్యదర్శులకు డిడిఒ అధికారాల బదలాయింపు చేయడంతో కార్యదర్శులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడును మంగళశారం వారంతా కలిసి ధన్యవాదాలు తెలిపారు. క్లస్టర్ వ్యవస్థను రద్దు చేస్తూ గ్రేడ్ 5 కార్యదర్శులకు డిడిఒ బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బొబ్బిలి నియోజకవర్గం గ్రేడ్ 5 సెక్రటరీలు అభినందించారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

రాష్ట్రంలో ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యను బోధిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులకు నైతిక విలువలు నేర్పడంతో పాటు వారితో స్నేహ పూర్వకంగా ఉండాలని, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు తెలిపారు. ఈ నెల 16న మండలంలోని కిల్తం పాలెం జవహర్ నవోదయ విద్యాలయంలో హర్యానాకు చెందిన విద్యార్థులపై వ్యాయామ ఉపాధ్యాయుడు శారీరక దండనకు పాల్పడ్డారని వారి తల్లి దండ్రులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ రాష్ట్రానికి సంబంధించిన కలెక్టర్, మన జిల్లా కలెక్టర్‌కు, జిల్లా బాలల సంక్షేమ సమితి వారికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా సిబ్బందితో కలిసి నవోదయ విద్యాలయాన్ని కేసలి అప్పారావు మంగళవారం సందర్శన చేశారు. బాధిత హర్యానా విద్యార్థులతో, వ్యాయామ ఉపాధ్యాయుడుతో, ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ బాలల న్యాయచట్టం ప్రకారం ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులపై శారీరక దండనకు పాల్పడితే వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జరిగిన సంఘటన పై ఒక నివేదికను వారం రోజుల్లో సమర్పించాలని ప్రిన్సిపల్‌కి ఆదేశాలు జారీచేశారు. కేంద్రంలోని డార్మేటరి, వంట గదులను, తరగతి గదులను పరిశీలించారు. కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న తరగతి, వసతి గదులను, రక్షణ గోడను తక్షణమే తిరిగి పునర్మించాల్సిన ఆవశ్యకత ఉందని ప్రిన్సిపాల్ కమిషన్ ఛైర్మన్‌ను కోరారు. దీని వల్ల విద్యాలయంలోకి ఇతరులు, పశువులు చొరబడుతున్నావని, తక్షణ పరష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యాలయం ప్రిన్సిపల్ వి. దుర్గ ప్రసాద్, జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది కెంగువ జయలక్ష్మి, యాళ్ల నాగరాజు, వెన్నెల సంధ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినితో మాట్లాడుతున్న కేసలి అప్పారావు

సబ్ స్టేషన్‌లో పిడుగుపడి విద్యుత్తు అంతరాయం

20 గ్రామాల్లో అంధకారం

ప్రజాశక్తి - డెంకాడ

మండల కేంద్రంలోని విద్యుత్తు సబ్ స్టేషన్‌లో మంగళవారం వర్షంతో పాటు పిడుగు పడి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి విద్యుత్‌కు అంతరాయం కలిగింది. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలోని సుమారు 20 గ్రామాలు అంధకారంలోకి వెళ్లిపోయాయి. మధ్యాహ్నం నుంచి రాత్రి 9 గంటల వరకు విద్యుత్ రాలేదు. ఏఈ అప్పలస్వామి నాయుడు తన సిబ్బందితో హుటాహుటిన మరమ్మతు పనులు చేపట్టి గ్రామాలకు విద్యుత్ అంతరాయం లేకుండా ఏర్పాటు చేశారు. కాగా ఇంకా కొన్ని గ్రామాలకు పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరా కాకపోవడంతో సబ్‌స్టేషన్‌లో పనులు జరుగుతూనే ఉన్నాయి.

విమానాశ్రయ భూముల్లో చెట్లు తొలగింపు

భోగాపురం: మండలంలోని ఏ.రావివలస రెవెన్యూ పరిధిలోని అమటాం వద్ద చెట్లు తొలగింపు కార్యక్రమం మంగళవారం ప్రశాంతంగా జరిగింది. విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించిన అదనపు భూమిని ఇక్కడ సేకరించారు. రెవెన్యూ, జిఎంఆర్ సంస్థ ప్రతినిధులు జెసిబిలతో చెట్లను తొలగిస్తున్నారు. జమ్మయ్య పేట గ్రామంలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వివాదం ఇంకా తేలలేదు. ఇక్కడ ఉన్న గృహాలను కూడా తొలగించేందుకు అధికారులు సమయత్తమవుతున్నారు. రెండు మూడు రోజుల్లో తొలగిస్తామని అధికారులు చెబుతున్నారు.



జెసిబితో చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

తెలుగు యువత పాదయాత్ర

ప్రజాశక్తి-విజయనగరంకోట

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా తెలుగుయువత విజయనగరం నుంచి సింహాచలంవరకు పాదయాత్ర చేపట్టింది. మంగళవారం పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద ఈ పాదయాత్రను 35వ డివిజన్ మాజీ కౌన్సిలర్ రొంగల రామారావు ప్రారంభించారు. పాదయాత్రకు లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అత్యంత ప్రభావం చూపగల నాయకుల్లో చంద్రబాబు నాయుడు ఒకరని, ఆయన అరెస్టు ఒక దుర్దినమని అన్నారు. విభజన హామీలు చట్టాలను అమలు చేస్తూనే రాష్ట్రంలో పరిణామాలను గ్రహించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. టిడిపి నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్ మాట్లాడుతూ పాదయాత్ర విజయవంతమై చంద్రబాబు నాయుడు జైలు నుంచి అతి త్వరలో విడుదలవుతారని వ్యక్తం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగ రావు, కర్రోతు నర్సింగరావు, గంటా పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోట వద్ద సంతకాల సేకరణ

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా బాబుతో మేము కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే మీసాల గీత ఆధ్వర్యాన సంతకాల సేకరణ చేపట్టారు. చంద్రబాబు ఎప్పటికైనా మచ్చలేని నాయకుడుగా జైలు నుంచి విడుదలవుతారని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టిడిపి దీక్షలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ 21వ రోజు నెల్లిమర్ల దీక్ష శిబిరంలో నగర పంచాయతీ 05,11 ,12,13, వార్డులు కౌన్సిలర్లు, నాయకులు ఆధ్వర్యంలో మంగళవారం దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజవర్గ ఇన్చార్జ్ కర్రోతు బంగార్రాజు, సీనియర్ నాయకులు మహంతి చిన్నంనాయుడు, సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, కర్రోతు సత్యనారాయణ, మహంతి శంకర్రావు, అవునాపు సత్యనారాయణ, పోతల రాజప్పన్న, నల్లం శ్రీను, తాడ్డి సత్యనారాయణ, దన్నాన రామ్మూర్తి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని జొన్నాడ, ఆకులపేట, డి.తాళ్లవలస, పంచాయితీల టిడిపి నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామి నాయుడు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు, నాయకులు పతివాడ అప్పలనారాయణ, పల్లె భాస్కర్ రావు, పతివాడ అప్పలనాయుడు, పతివాడ శివరామ విద్య సాగర్ నాయుడు, కాగితాల సత్యనారాయణ రెడ్డి, కొర్నాన ఆదిబాబు, చీకటి సుహాసిని, కాగితాల బాలు, సారిక అప్పారావు, కోరాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

గ్రీన్ అంబాసీడర్లకు బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీను డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం గ్రీన్ అంబాసిడర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్‌లకు సుమారు 10 నుంచి 14 నెలలుగా వేతనాలు చెల్లించకుండా వెట్టి చాకిరి చేసుకుంటున్నారన్నారు. సకాలంలో జీతాలు రాకపోవడం వల్ల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందితో సతమతమవుతున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి ఇటీవల చనిపోయిన గ్రీన్ అంబాసిడర్ మామిడి గౌరికి రూ.10 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, అందరికీ కనీస వేతనం అమలు చేయాలనీ, 2020లో ఇచ్చిన జీవో 680 ప్రకారం రూ.10వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని గాంధీ విగ్రహానికి అందించారు. ఈ కార్యక్రమంలో పోలిరాజు, పరమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కెజిపూడిలో గడపగడపకు..

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కెజిపూడి పంచాయతీలో మంగళశారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గిరిజన గ్రామాలకు చెందిన 159 మందికి వన్‌బిలు అందజేశారు. ఎట్టకేలకు సిపిఎం పోరాటంతో సాగు భూములకు హక్కులు పొందినందుకు గిరిజన రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, నెట్ క్యాప్ డైరెక్టర్ పద్మావతి, వైసిపి మండల అధ్యక్షులు ఎం జగ్గు బాబు, నారాయణ, సర్పంచ్ బంగారయ్య, ఎంపిటిసి ముత్యాలమ్మ, సిపిఎం రైతు సంఘం జిల్లా నాయకులు చల్లా జగన్, ఎంపిడిఒ పట్నాయక్, తహశీల్దార్ ప్రసన్నకుమార్, పంచాయతీ కార్యదర్శి పద్మ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి - బొబ్బిలి

మండలంలోని మెట్టవలస సమీపంలో లారీ ఢీకొని యువకుడు పేకేటి ధర్మతేజ (25) మృతి చెందాడు. పారాది గ్రామానికి చెందిన ధర్మతేజ ఇంజినీరింగ్ పూర్తి చేసి హైదరాబాద్‌లో కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. కొన్ని రోజుల క్రితం సొంత గ్రామం వచ్చాడు. ద్విచక్ర వాహనం ఫైనాన్స్ కట్టేందుకు మంగళవారం బొబ్బిలి వచ్చి ఫైనాన్స్ కట్టి తిరిగి ఇంటికి వెళ్తుండగా మెట్టవలస సమీపంలో రామభద్రపురం నుంచి బొబ్బిలి వైపు వస్తున్న లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించాడు. కుటుంబాన్ని ఆదుకుంటాడని భావించిన ధర్మతేజ అకాల మరణంతో కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - బొబ్బిలి

మండలంలోని కలవరాయి సమీపంలో ద్విచక్ర వాహనం ఢీకొని సిహెచ్ మోహనరావు తీవ్రంగా గాయపడ్డాడు. రాముడువలస గ్రామానికి చెందిన మోహనరావు ధాన్యం ఆడించేందుకు కలవరాయి వచ్చాడు. ధాన్యం ఆడించుకుని ఇంటికి వెళ్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

లారీ ఢీకొన్న ఘటనలో దొడ్డి అచ్చియమ్మ(57) అనే మహిళ మృతి చెందిందని ఎస్ ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భవానినగర్ వద్ద మంగళవారం ఉదయం దొడ్డి అచ్చియమ్మ నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుంచి లారీ బలంగా ఢీ కొట్టింది. దీంతో ఆమె అక్కడకక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త తాతారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ ఐ తెలిపారు.